క్లుప్తంగా

నంద్యాలకు బయలుదేరిన మహానందీశ్వరుడు



మహానంది నుంచి నంద్యాలకు వెళ్తున్న మహానందీశ్వర దంపతులు

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులు బుధవారం నంద్యాలకు బయల్దేరారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నంద్యాలలోని బ్రహ్మనందీశ్వరస్వామి ఆలయానికి వెళ్లారు. ముందుగా స్థానిక అలంకార మండపంలో ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెందూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్ధనశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి మేళతాళాల మధ్య నంద్యాలకు బయలుదేరి వెళ్లారు.

మల్లన్న సన్నిధిలో తెలంగాణ మంత్రి



మల్లన్న దర్శనానికి వెళ్తున్న మంత్రి దామోదర

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదరం రాజనరసింహ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. బుధవారం ఆయనకు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన నిర్వహించుకుని, మంత్రి తులాభారం వేయించుకున్నారు. అమ్మవారి ఆశీర్వచన మండపం వద్ద మంత్రికి వేదపండితులు వేదమంత్రాలు పలకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. అధికారులు స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు.

బరక సంజీవరాయస్వామికి ప్రత్యేక పూజలు



మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన బరక సంజీవరాయ స్వామికి అమావాస్య పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్లకు ఉదయం అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, ఆకుపూజ, మన్యసూక్త హోమం, పల్లకీసేవా తదితర పూజలను ఆలయ పురోహితులు నరహరి శర్మ, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శానిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

బుక్కాపురంలో గ్రామ సభ

మహానంది: మండలంలోని బుక్కాపురం గ్రామంలో బుధవారం సర్పంచ్ కందుల వరలక్ష్మమ్మ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ కుంచపు లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకు సిబ్బంది చొరవ చూపాలన్నారు. ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుమంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరామర్శ

పాములపాడు: స్థానిక ఏఎస్ఆర్ జెడ్పీ హైస్కూల్‌లో తేనెటీగల దాడిలో గాయపడిన విద్యార్థులను హెచ్ఎం గోపాల్, ఉపాధ్యాయుడు రవి పరామర్శించారు. బుధవారం యర్రగూడూరు, రుద్రవరం, పాములపాడు, కోల్స్ ఆనందాపురం గ్రామాలకు వెళ్లి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు.

ముగిసిన 'స్వచ్ఛతా హీ సేవ'

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. కార్యక్రమంలో భాగంగా క్షేత్ర పరిధిలోని పలు చోట్ల పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ముగింపు రోజు క్షేత్ర పరిధిలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఈఓ రమణమ్మ, ఈఈ నరసింహారెడ్డి, డీఈఈ సుబ్బారెడ్డి, ఉద్యానవన అధికారి లోకేష్ పాల్గొన్నారు.

ఆలయ పరిశుభ్రతకు సహకరించాలి

బండిఆత్మకూరు: ఓంకారం ఆలయ పరిసరాలలో మొక్కలు పెంచి, సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఫారెస్ట్ రేంజ్ అధికారి జెడ్ నాసిర్‌జా కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత కోసమే, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఆలయ పరిసరాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న అంగళ్లకు నోటీసులు ఇచ్చామన్నారు.

మహాత్ముడి అడుగుజాడల్లో నడుద్దాం

జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని శ్రీశైలం, నందికొట్కూర్ నియోజకవర్గాల వ్యాప్తంగా బుధవారం ఘనంగా ని ర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతోపాటు ప్రధాన కూడళ్లలోని గాంధీ విగ్రహాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్ముడి అడుగుజాడల్లో నడుద్దామని పలువురు పిలుపునిచ్చారు.

- ఘనంగా గాంధీ జయంతి
- పూలమాలలు వేసి నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

జాతిపిత ఆదర్శం

ఆత్మకూరు: పట్టణంలోని గాంధీ విగ్రహానికి మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ ఆసియామారుఫ్, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతిపిత మహాత్మాగాంధీని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వారు సూచించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన గాంధీ జయంతి వేడుకల్లో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పి.ఇబ్రహీం, నాయకులు ఖాదర్‌బాషా, ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్‌బాషా పాల్గొన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు హుసేన్‌సాహెబ్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. యూనియన్ నాయకులు సయ్యద్ చాంద్‌బాషా, పి.నూర్‌మహ్మద్ పాల్గొన్నారు. అలాగే నంద్యాల టర్నింగ్‌లోని రైతుసేవా సంఘం కార్యాలయంలో నాయకులు మోమిన్‌మునీర్‌బాషా, కృషి పండ్ల తోటల సంఘం అధ్యక్షుడు బైరాపురం మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో గాంధీ పలువురు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.



ఆత్మకూరు: గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ ఆసియామారుఫ్

జూపాడుబంగ్లా: మండల కేంద్రంతోపాటు పోతులపాడు, తూడిచెర్ల, తాటిపాడు, తరిగోపుల, తాటిపాడు, తర్తూరు, మండ్లెం, పారుమంచాల తదితర గ్రామాల్లో అధికారులు, సర్పంచులు, సచివాలయ ఉద్యోగులు గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయంలో..

గాంధీజీ ఆశయాలను సాధిద్దాం



వెలుగోడు: గాంధీజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

వెలుగోడు: గాంధీజీ ఆశయాలను సాధించినప్పుడే ఆయనకు ఘన నివాళి అని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని గాంధీ విగ్రహానికి ఎంపీపీ లాలం రమేష్, ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఉమ్మడి జిల్లాల వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు బలాన్ని వెంకట సత్యనారాయణ, వైస్ ఎంపీపీ కోదావత్ శంకర్‌నాయక్, తాళ్లూరి సంజీవరాయ ప్రసాద్, లిటిల్ ఏంజెల్స్ కరస్పాండెంట్ ఇమ్మానియేల్, అమీర్ హంజా, పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శ్రీశైలంప్రాజెక్ట్: జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి శ్రీశైలం ఐటీడీఏ కార్యాలయంలో ఇన్‌చార్జ్ పీఓ సురేష్ కుమార్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా, త్యాగం, ప్రతి భారత పౌరుడి స్వాతంత్ర్యం కోసం అహర్నిషలు పోరాడి వీర మరణం చెందిన మహాత్మాగాంధీ ప్రతిఒక్కరికీ ఆదర్శమన్నారు.

మిడుతూరు: స్థానిక ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయం, గ్రామ సచివాలయాల్లో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సర్పంచ్ జయలక్ష్మమ్మ, ఈఓఆర్డీ ఫకృద్దీన్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మహానంది: మహానంది దేవస్థానం ప్రధాన కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జున శర్మ, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. బుక్కాపురంలో గాంధీ చిత్రపటానికి మండల ఉపాధ్యక్షురాలు కుంచపు లక్ష్మీనరసమ్మ, సర్పంచ్ కందుల వరలక్ష్మమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఈఓఆర్డీ శివనాగజ్యోతి ఆధ్వర్యంలో గాంధీ జయంతిని నిర్వహించారు.

బండిఆత్మకూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి ఎంపీపీ దేరెడ్డి సంజీవరెడ్డి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ రాగాల రమణ, బండి ఆత్మకూరు సర్పంచ్ ఎరుకలు సంధ్య పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని మద్దూరు గ్రామ సచివాలయంలో గాంధీ జయంతిని సర్పంచు అక్తరున్నిసాబీ, ఎంపీటీసీ బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పాములపాడు: గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచు, ఎంపీటీసీ వైఎస్సార్‌సీపీ నాయకులు

గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే నివాళి



నందికొట్కూరు: మున్సిపల్ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గాంధీ దంపతుల విగ్రహాలకు ఎమ్మెల్యే జయసూర్య, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ రబ్బానీ, కౌన్సిలర్లు, పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రహ్మర్షి పిత మహా సంస్థ జీవహింస చేయరాదని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కాగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసే సమయంలో ఎమ్మెల్యే సమక్షంలోనే మాండ్ర శివానందరెడ్డి వర్గీయులు, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి వర్గీయుల మధ్య ఘర్షణ చోటుచేసుకోగా రూరల్ సీఐ సుబ్రమణ్యం జోక్యం చేసుకుని నచ్చజెప్పారు. మున్సిపల్ కమిషనర్ బేబి, కౌన్సిలర్లు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆశయ సాధనకు కృషి చేద్దాం



నెహ్రూనగర్‌లో గాంధీ చిత్రపటానికి పూలు వేసిస్తున్న దృశ్యం

పగిద్యాల: గాంధీజీ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని ఎంపీడీఓ వెంకటరమణ కోరారు. ఎంపీడీఓ, తహసీల్దార్, సచివాలయం కార్యాలయాల్లో గాంధీ చిత్రపటాలకి పూలమాలలు వేసి అధికారులు జోహార్లు అర్పించారు. అలాగే నెహ్రూ నగర్‌లో పంచాయతీ కార్యదర్శి వీరన్న యాదవ్, సర్పంచ్ రాజేశ్వరి ఆధ్వర్యంలో గాంధీ జయంతిని నిర్వహించారు.

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచులు విష్ణువర్ధన్ రెడ్డి, జమిలా బీ, నిత్యలక్ష్మీదేవి, మారెన్న, మశమ్మ, బాల ఎల్లయ్య, సరస్వతి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి చౌట్కూరు విద్యార్థులు

మిడుతూరు: మండల పరిధిలోని చౌట్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ ముస్తహీర్ తెలిపారు. గురువారం ఆయన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో 21న నిర్వహించిన క్రీడా బాస్కెట్ బాల్ అండర్ -14 విభాగంలో శిరీషా, ఇస్మాయిల్, అండర్ 17 విభాగంలో మనోజ్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు.



విద్యార్థులతో హెచ్ఎం రవిప్రకాష్‌రావు, ఫిజికల్ డైరెక్టర్ ముస్తహీర్

నందికొట్కూర్ విద్యార్థులు ..

నందికొట్కూరు: గత నెల 25న కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికయ్యారని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ షేక్షావలి తెలిపారు. వాలీబాల్‌లో సుమతి, హాకీలో నరసింహులు ప్రతిభ కనబరిచి విజయవాడ, కాకినాడలలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. పీడీ రియాజుద్దీన్, అధ్యాపకులు సురేష్‌తో కలిసి విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

అలరించిన భక్తి రంజని

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన స్వరరాగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యూజిక్ వారి భక్తిరంజని కార్యక్రమం భక్తులను అలరించింది. కార్యక్రమంలో శంభో శివశంభో, శివుని శిరస్సుపై చిందులాడేను, గంగాధరాయ నమః, నీ దయమూపై చూపరాదా, హర హర శంభో శంకర తదితర గీతాలకు వీణధారి, శ్రీవల్లి, లలిత, లయమాధురి, శృతిమాధురి తదితరులు ఆలపించారు.



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

నేటి నుంచి రాయితీ శనగల పంపిణీ

జూపాడుబంగ్లా: గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో జేజీ11 రకం రాయితీ శనగ విత్తనాలను గురువారం నుంచి పంపిణీ చేయనున్నట్లు ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలానికి 850 క్వింటాళ్లు మంజూరయ్యాయని, క్వింటం శనగ విత్తనాల ధర రూ.9,400 కాగా 25 శాతం రాయితీ(రూ2,350) పోనూ రైతులు రూ.7,050 చెల్లించాలన్నారు. శనగవిత్తనాలు అవసరమైన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, సెల్‌ఫోన్ తీసుకెళ్లి రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

దసరా ఉత్సవాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం



శ్రీశైలం ఆలయ పరిధిలో వెలగని విద్యుద్దీపాలు

- విద్యుద్దీకరణ పనుల్లో దేవస్థాన అధికారుల ఉదాసీనత
- ఉత్సవాలు ప్రారంభమవుతున్నా వెలగని విద్యుద్దీపాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో దసరా మహోత్సవాలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దసరా మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని దేవస్థాన అధికారులు సమీక్షలు నిర్వహించి, దేవస్థాన ఈఓ అధికారులకు పలు ఆదేశాలు సైతం జారీ చేశారు. అయితే అధికారుల ఉదాసీనతగా వ్యవహరిస్తూ పండుగ జాతరను లేకుండా చేశారు. ప్రధాన అమ్మవారి ఆలయం వద్ద కూడా విద్యుత్ లైట్లు వెలగలేదు. గతంలో ఉత్సవాల ముందు రోజే ఆలయం వద్ద విద్యుద్దీకరణలతో పండుగ వాతావరణం కనిపించేది. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం శ్రీశైలంలో జరిగే ఉత్సవాలపై నిర్లక్ష్యం ప్రదర్శించడంతో అధికారులు తమకెందుకేల అన్నట్లు వ్యవహరించడంతో ఆలయం వద్ద విద్యుత్ లైట్లు లేకుండా కళ తప్పింది. ప్రధాన ఆలయం, అమ్మవారి ఆలయం ముందు, వెనుక గోపురం, ప్రధాన ఆలయ గోపురం, గంగాధర మండపం వద్ద స్వామిఅమ్మవార్ల ప్రతిమలతో విద్యుద్దీకరణ, ప్రధాన వీధిలో లైటింగ్, ప్రధాన కూడళ్లలో స్వామిఅమ్మవార్ల ప్రతిమలతో విద్యుత్‌లైటింగ్ ఏర్పాటు చేసేవారు. ఈ ఏడాది ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టలేదు. దేవస్థాన అధికారుల తీరుతో పలువురు భక్తులు మండిపడుతున్నారు.

అరకొరగా విద్యుత్ అలంకరణ పనులు

మహానంది: మహానందిలో దసరా నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లలో అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఉత్సవాలకు రెండు, మూడు రోజుల ముందే విద్యుత్ అలంకరణ పనులు పూర్తి చేయాల్సి ఉన్నా బుధవారం రాత్రికి సైతం పనులు పూర్తి కాకపోవడంతో స్థానికులు విమర్శిస్తున్నారు. మహానందిలో ఉత్సవాలంటే గర్భాలయ గోపురాలతోపాటు రాజగోపురం, మహాద్వారం విద్యుత్ వెలుగులతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. కానీ ప్రస్తుతం పనులు పూర్తి కాకపోవడంతో భక్తులు నిరాశ చెందుతున్నారు.



పూర్తికాని విద్యుద్దీపాల అలంకరణ

పింఛన్ కోసం పడిగాపులు

పాములపాడు: మండలంలోని మద్దూరు గ్రామ సచివాలయం వద్ద పింఛన్ కోసం వృద్ధులు పడిగాపులు కాశారు. గ్రామానికి చెందిన పింఛన్‌దారులు చాకలి పాపన్న సొంత పని నిమిత్తం జడ్చర్లకు, బోగెం లక్ష్మిదేవి ఆరోగ్యం బాగోలేక కర్నూలు ఆస్పత్రికి వెళ్లడంతో ఈనెల 1వ తేదీన మొదటి రోజు పింఛన్ తీసుకోలేకపోయారు. సబిరాబీ అనే మహిళ ఇంటి వద్దే ఉన్నా పింఛన్ అందలేదు. దీంతో వీరు ఉదయమే సచివాలయానికి చేరుకున్నారు. సిబ్బంది ఎంతకూ రాకపోడంతో ఫోన్ చేశారు. తీరా మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో సిబ్బంది వచ్చి పింఛన్ సొమ్ము అందజేసినట్లు లబ్ధిదారులు తెలిపారు. కాగా మంగళవారం సాయంత్రానికి 97.45% శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ షేక్ అమానుల్లా తెలిపారు.

గోకులం షెడ్లకు 64 దరఖాస్తులు

జూపాడుబంగ్లా: మండలంలోని 12 పంచాయతీలకు గానూ మంజూరై 25 గోకులం షెడ్లకు 64 దరఖాస్తులు అందాయని ఏపీఓ గౌరీబాయి, ఈసీ నజీర్‌బాషా తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ చివరిగడువు ప్రకటించకపోవడంతో దరఖాస్తులు వస్తూనే ఉన్నాయన్నారు. విచారణ చేసి అర్హులైన వారిని ఎంపికచేసి త్వరలో వారికి గోకులం షెడ్లు మంజూరు చేస్తామన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఆత్మకూరు: వచ్చే ఏడాది జనవరి 8, 9 తేదీలలో పట్టణంలో నిర్వహించనున్న ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాల ఇస్తేమాకి హాజరు కావాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి ఇస్తేమా కమిటీ సభ్యులు, మదర్సా కమిటీ చైర్మన్ యం.ఎ.రషీద్ ఆహ్వాన పత్రికను అందజేశారు. బుధవారం ఆయన మత పెద్దలతో కలిసి ఎమ్మెల్యే కార్యాలయంలో ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యేకు అందించారు.

అంజన్నకు పూజలు

ఆత్మకూరు: పట్టణంలోని ఆత్మలింగేశ్వరస్వామి దేవస్థానంలో అభయాంజనేయస్వామికి బుధవారం అమావాస్య సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ చేసి సామూహిక కుంకుమార్చన, 13 రకాల నక్షత్ర హారతులు చేపట్టారు.

నేడు సర్వ సభ్య సమావేశం

జూపాడుబంగ్లా: ఎంపీపీ సువర్ణమ్మ అధ్యక్షతన గురువారం జరగనున్న మండల సర్వసభ్య సమావేశంలో సమస్యలపై సభ్యులు గళం విప్పి పరిష్కారం అయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి మూడు మాసాలకోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను, చేసిన అభివృద్ధి పనులు, మంజూరైన నిధులు, వెచ్చించిన నిధులపై చర్చించి ప్రాధాన్యతానుసారంగా సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికలు రూపొందించి, సభలో తీర్మానాలు చేసి ఆమోదించనున్నారు.

చట్టాన్ని అతిక్రమిస్తే రౌడీ షీట్



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సుబ్రహ్మణ్యం

మిడుతూరు: ఎవరైనా చట్టాన్ని చేతిలోకి తీసుకొని గొడవలకు పాల్పడితే రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. బుధవారం పీరుసాహెబ్ పేట గ్రామంలోని ఓసీ, బీసీ కాలనీల్లో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. చిన్నచిన్న విషయాలకు ఘర్షణ పడి అనవసరంగా కేసుల్లో చిక్కుకుని జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. సమస్యలు ఉంటే పోలీసులు, గ్రామ పెద్దల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

సంస్థ అభివృద్ధిలో ఏజెంట్ల పాత్ర అమోఘం

ఆత్మకూరు: భారతీయ జీవిత బీమా సంస్థ అభివృద్ధిలో ఏజెంట్ల పాత్ర అమోఘమని బ్రాంచి మేనేజర్ పాండురంగనాయక్ అన్నారు. భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం సమాఖ్య అధ్యక్షులు స్వామిదాసు పతాకాన్ని విష్కరించారు. ఈ సందర్భంగా బ్రాంచి మేనేజర్ మాట్లాడుతూ సంస్థ భవనానికి ఏజెంట్లు మూలస్తంభాలు అని కొనియాడారు. కార్యక్రమంలో జోనల్ నాయకులు రామకృష్ణారెడ్డి, అబ్దుల్‌కరీం, డెవలప్‌మెంట్ ఆఫీసర్ జగన్నాథ్‌రాజు, ఐసీఈయూ నాయకులు విజయకుమార్, నాగన్న, డివిజన్ నాయకులు లక్ష్మిరెడ్డి, నాగిరెడ్డి, రమణయ్య, రాంబాబు, రహంతుల్లా, ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్రాంచి మేనేజర్ పాండురంగనాయక్

ఉద్యోగుల అంతర్గత బదిలీలు

- శ్రీశైలం నుంచి వచ్చిన ఉద్యోగులకు విధుల కేటాయింపు

మహానంది: మహానంది దేవస్థానంలో పనిచేస్తున్న ఉద్యోగుల అంతర్గత బదిలీలు చేస్తూ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీశైలం దేవస్థానం నుంచి బదిలీపై వచ్చిన సూపరింటెండెంట్ దేవికను అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్‌గా నియమించారు. అంబటి శశిధర్‌రెడ్డిని టెంపుల్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా కేటాయిస్తూ అన్నదానం, ఎలక్ట్రికల్, గోశాల విభాగాలను అప్పగించారు. శానిటేషన్ ఫైల్స్, ఆడిట్, కోర్టు, జనరల్ వ్యవహారాల విభాగానికి శ్రీశైలం నుంచి వచ్చిన సీనియర్ అసిస్టెంట్ పి.సుబ్బారెడ్డి, డీసీబీ విభాగానికి సీనియర్ అసిస్టెంట్ జగదీశ్వర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్–2గా జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసప్రసాద్, పడితరం విభాగం నాగమల్లయ్యకు, అన్నదానం విభాగం, ఎంపీఎఫ్ ఇన్‌చార్జ్‌గా లోకేశ్వరప్ప, డొనేషన్ కౌంటర్‌కు అనురాధ, ఆలయం లోపల పారిశుధ్య పనుల పర్యవేక్షణకు వెంకటలక్ష్మీ, శివాలయం మొదటి షిఫ్టుకు లక్ష్మయ్య, అకామిడేషన్ ఉదయం షిఫ్టుకు మదన్ ఉండగా రెండవ షిఫ్టుకు రామశివలను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

మద్యం దుకాణాలకు 9లోపు దరఖాస్తు చేసుకోండి

నందికొట్కూరు: మద్యం దుకాణాల నిర్వహణకు ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎక్సైజ్ శాఖ, ప్రొహిబిషన్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాముడు సూచించారు. బుధవారం సాయంత్రం స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మద్యం పాలసీపై అధికారులకు అవగాహన కల్పించారు. సమావేశంలో నందికొట్కూరు ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు, ఎస్ఐ జఫరుల్లా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామాంజనేయులు

హైఓల్టేజీతో వినియోగదారులకు నష్టం

జూపాడుబంగ్లా: పవర్ హైఓల్టేజీ సప్లై కావడంతో ఇళ్లలోని ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయి వినియోగదారులకు ఆర్థిక నష్టం జరిగిన ఘటన బుధవారం మండల కేంద్రంలో చోటుచేసుకుది. బస్టాండు సమీపంలోని మలుపు వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు సమీపంలోని విద్యుత్ తీగలపై కోతి దూకడంతో రెండు విద్యుత్ తీగలు ఒకదానికి మరొకటి తాకి ట్రాన్స్‌ఫార్మర్‌లోని న్యూట్రల్‌వైర్లు కట్ కావటంతో హైఓల్టేజీ సరఫరా అయ్యింది. దీంతో సిద్దేశ్వరంపేట, నీలిపల్లెపేట కాలనీల్లోని గృహాల్లో ఫ్యాన్లు, టీవీలు, ట్యూబ్‌లైట్లు, ఏసీలు కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. ట్రాన్స్‌కో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని న్యూట్రల్‌వైర్లను సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

దోమల నివారణ చర్యలు

ఆత్మకూరు: పట్టణంలోని కప్పలకుంట, శ్రీరామనగర్, పాత బస్టాండు, అప్పలరాజు వీధి, తిక్కయ్యస్వామి దర్గా ప్రాంతాల్లో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారుఫ్ ఆసియా, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎం.ఎ.రషీద్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బంది దోమల నివారణ చర్యలు చేపట్టారు.